ఎల్‌ఓసీ చెక్కులు అందజేత

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన జి.తిరుపతి రావు, సూరారం డివిజన్ షాపూర్ సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన సి.దేవి చరణ్, కుత్బుల్లాపూర్ డివిజన్ నివాసి జి.సంతోషికి ఎల్‌ఓసీ మంజూరైంది. ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన రూ. 7 లక్షల ఎల్‌ఓసీ చెక్కును బుధవారం ఆయా డివిజన్లకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు నార్లకంటి శ్యామ్, లక్ష్మణ్, కుంట వేణు, విజయ్ హరీష్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం కృషి



కార్మికుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని శ్రమ శక్తి అవార్డు గ్రహీత, కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. పారిశ్రామికవాడలోని జకోటి ప్లాస్టిక్ పరిశ్రమలో మహ్మద్ మర్జూర్ ఆలం అనే కార్మికుడు రెండేళ్లకు పైగా పని చేస్తున్నాడు. ఇటీవల అతను అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మదన్‌గౌడ్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి కార్మికుడికి రూ.3 లక్షల ఆర్థికసాయం అందించే విధంగా కృషి చేశారు. సదరు చెక్కును బుధవారం కార్మికుడి భార్యకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సిద్ధిక్, సుభాష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల దుర్గాభవానికి ఎమ్మెల్సీ పూజలు



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ఏడుపాయల దుర్గాభవాని అమ్మవారిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం తీసుకున్నారు. ఆయన వెంట భౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, పోలీస్ గోవింద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలి



డ్రగ్స్‌పై పోస్టర్స్ ద్వారా అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజేష్ తదితరులు

మూసాపేట: మాదక ద్రవ్యాల జోలికి వెళితే సూసైడ్ చేసుకున్నట్లే అని, యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ రాజేష్ అన్నారు. బుధవారం కూకట్‌పల్లిలోని అశోకవన్‌మాల్‌లో కూకట్‌పల్లి పోలీసులు సే నో టు డ్రగ్స్ అని సంతకాల సేకరణ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కళాశాలకు వెళ్లే విద్యార్థులపై తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం శ్రద్ధ వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాన్‌సూన్ సిబ్బంది సిద్ధం!

8 డివిజన్లకు ఒక్కొక్క సూపర్ వైజర్

లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలపై శిక్షణ

మొదటిసారి హైడ్రా ఆధ్వర్యంలో పనులు





జంట సర్కిళ్ల మాన్‌సూన్ సిబ్బంది

కుత్బుల్లాపూర్: వర్షాకాలం నేపథ్యంలో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో మాన్‌సూన్ టీమ్స్‌ను రెడీ చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలతో మొత్తం 8 డివిజన్లకు ఒక్కొక్క సూపర్ వైజర్‌ను నియమించి స్థానికంగా ఉన్న సిబ్బందితో మమేకమై వర్షాకాలంలో ఏర్పడే ఇబ్బందులను తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ మాన్‌సూన్ ఇన్‌చార్జీగా ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి జాఫర్ హుస్సేన్, గాజులరామారం సర్కిల్‌కు భిక్షారెడ్డిని నియమించారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను అధ్యయనం చేస్తున్నారు. ఎక్కడైనా ఎమర్జెన్సీ పరిస్థితులు తలెత్తితే వెంటనే మాన్‌సూన్ టీమ్స్ రంగంలోకి దిగి అక్కడ నీటి నిల్వ ప్రమాద తీవ్రతను గమనించి సహాయక చర్యలు చేపట్టనున్నారు. హైడ్రా ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా మాన్‌సూన్ బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో గతానికి భిన్నంగా పనులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. సర్కిల్ పరిధిలో అత్యంత ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలతో పాటు వర్షం భారీగా పడితే ఏ ప్రాంతాల్లో కాలనీలు నీట మునుగుతాయి.. అన్న విషయంపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు. అక్కడ ఏ విధంగా సహాయం చేయాలన్న విషయంపై మాన్‌సూన్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

ప్రత్యేక కంట్రోల్ రూమ్

వర్షాకాలంలో తలెత్తే వాటర్ లాగింగ్, ట్రాఫిక్ జామ్, వరదలు తదితర సందర్భాల్లో ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు హైడ్రా ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇది 24 గంటల పాటు అందుబాటులో ఉంటుంది. 9000113667, 8712406901, 040-29555500 నెంబర్లలో సంప్రదించవచ్చు. జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ నెంబరు 040-2111 1111 కాల్ చేసి సహాయం పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రణాళికలతో మున్సిపల్ అభివృద్ధి

మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ అభివృద్ధే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతున్నామని, కొత్తగా అపార్ట్‌మెంట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు అసెస్మెంట్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. గ్రేడ్ 1 కమిషనర్‌గా పదోన్నతి లభించిన సందర్భంగా బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... మున్సిపాలిటీ అభివృద్ధికి సంక్షేమ సంఘాలు సహకరించాలని కోరారు. రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించి సమస్యను పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై పలు దుకాణ యజమానులు ముందుకు రావడం, అందుకు తగ్గట్టుగానే ప్లాస్టిక్ కవర్లను రోజురోజుకు తగ్గిస్తున్నారని, మరో రెండు, మూడు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్న నమ్మకం ఉందన్నారు. అక్రమ నిర్మాణాల విషయంపై ఫిర్యాదులు రాగానే వారికి నోటీసులు జారీ చేసి పనులు నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. అనుమతులకు మించి నిర్మాణం చేపడితే ఊరుకునే సమస్యే లేదని హెచ్చరించారు. సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి దోహదపడాలని కోరారు. పారిశుద్ధ్యం, మంచినీరు వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కొన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య సిబ్బంది పనులు చేయడం లేదన్న విషయంపై ఆరా తీస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

బస్సులు ఆపాలని డీఎంకు వినతి



డీఎంకు ప్రయాణికుల ఇబ్బందులను వివరిస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: సూరారం కాలనీ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు సరిగా ఆపడం లేదని కాలనీ డిజేబుల్ వెల్ఫేర్ అసోషియేషన్ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు బుధవారం డిపో మేనేజర్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. కాలనీకి బస్సులు సరిగా రావడం లేదని, రెగ్యులర్‌గా పంపించాలని కోరారు. అనంతరం డిపో మేనేజర్ వారితో కాలనీకి వచ్చి బస్టాండ్‌ను పరిశీలించారు. గతంలో నిత్యం వచ్చే పదుల సంఖ్యలో బస్సులను కాలనీ బస్టాప్ వరకు వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంజయ్య, యాదయ్య, నరేందర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కంది శ్రీరాములు, మారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ లేక పొంచి ఉన్న ప్రమాదం!



రంగారెడ్డినగర్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ ఏర్పాటు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. రంగారెడ్డినగర్ డివిజన్ రంగారెడ్డినగర్‌కు వెళ్లే మార్గంలో నందాపుడ్ పరిశ్రమ ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేకపోవడం, ఫ్యూజ్‌బాక్స్‌లకు మూత లేకపోవడంతో చిన్నారులు ప్రమాదాల బారిన పడే ఆస్కారముందని సమీప ఇళ్ల వాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో పాఠశాలలు ఉండటంతో స్కూల్‌కు వచ్చి వెళ్లే సమయంలో చిన్నారులు ప్రమాదవశాత్తు ఫ్యూజ్‌బాక్స్‌ను ముట్టుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటుతో పాటు ఫ్యూజ్‌బాక్స్‌కు మూత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

టీబీ లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి



ప్రచారం నిర్వహిస్తున్న మెడికల్ సిబ్బంది

బాలానగర్: క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని కూకట్‌పల్లి మెడికల్ ఆఫీసర్ డా. మమత అన్నారు. బుధవారం టి.బి. ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెట్రో క్యాష్ అండ్ క్యారీ ఇండియా లిమిటెడ్‌లో పనిచేసే 153 మంది ఉద్యోగులకు ఏఐ ఎక్స్‌రే ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు రావటం, దగ్గుతున్నప్పుడు ఛాతి నొప్పి, బరువు తగ్గడం, జ్వరం ముఖ్యంగా సాయంత్రం వేళల్లో రావడం, ఆకలి లేకపోవడం, శ్వాస ఆడక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, సూపర్ వైజర్స్ మోహన్, రామకృష్ణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రేపు జగన్నాథ రథయాత్ర

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మహా శృంగదాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదర్‌నగర్‌లోని మల్లికార్జున థియేటర్ సమీపంలోని విజయలక్ష్మి అమ్మవారి దేవాలయం నుంచి జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, వై జంక్షన్ వరకు ఈ రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విదేశీ భక్తులు, శ్రీ కృష్ణ భక్తులు పాల్గొని స్వామివారి భక్తి పాటలు, నృత్యాలతో ఈ రథయాత్ర కొనసాగనుందని పేర్కొన్నారు.

25 శాతం ఉచిత విద్య అందించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: ప్రయివేటు పాఠశాలల్లో నిరు పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా విద్యను అందించే దిశగా చొరవ తీసుకువాలని లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్ కోరారు. బుధవారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అత్యధికంగా నిరుపేదలు నివాసం ఉంటున్నారని, వేల రూపాయలు చెల్లించి తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించలేరని తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తలపెడుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను హెచ్ఎంటీ, ఐడీపీఎల్ కాలనీల్లో ఏర్పాటు చేసే విధంగా చొరవ చూపాలని కోరారు.

ఉప కులాలను మళ్లీ బీసీ జాబితాలో చేర్చాలి



శ్రీశైలంగౌడ్, ఎమ్మెల్యే సాంబశివరావులను సన్మానిస్తున్న బీసీ ఉప కులాల సంఘం నేతలు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీసి జాబితా నుంచి తొలగించిన 26+1 ఉప కులాలను మళ్లీ బీసీ జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని ఆ ఉపకులాల అసోసియేషన్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్‌ను కోరారు. నియోజకవర్గ పరిధిలోని షాపూర్ నగర్‌లో శ్రీశైలంగౌడ్‌ను తన నివాసంలో 26+1 ఉపకులాల అసోసియేషన్ సభ్యులు కలిశారు. అనంతరం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావుతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ చేసిన అన్యాయాన్ని కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సమస్యను వివరిస్తామన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం సీఎంను కలిసి న్యాయం జరిగేలా కృషి చేస్తామని శ్రీశైలంగౌడ్ హామీ ఇచ్చారు. అనంతరం వారిని సన్మానించారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం



జాబ్ మేళాకు హాజరైన జాయింట్ సెక్రటరీ జ్యోత్స్నారాణి తదితరులు

సుభాష్‌నగర్: కంపెనీలు, నిరుద్యోగ యువతను ఒకే వేదిక పైకి తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించమే ప్రభుత్వ లక్ష్యమని వృత్తి విద్యా కోర్సుల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జ్యోత్స్నారాణి అన్నారు. కేఎం పాండు గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు బుధవారం అప్రెంటిషిప్ జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై డీఐఈఓ కిషన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చదువు పూర్తైన వెంటనే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ జాబ్ మేళా ఉద్దేశమని, నిరుపేద కుటుంబాల పిల్లలకు ఇది గొప్ప అవకాశమని పేర్కొన్నారు. అనంతరం కుత్బుల్లాపూర్ కళాశాల టాపర్లకు వెండి మెడల్స్‌ను బహూకరించారు. స్పెషల్ ఆఫీసర్ ఎం.పాల్ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మైమూన్ అప్రెంటిషిప్ జాబ్ మేళాను పర్యవేక్షించారు. జాబ్ మేళాకు 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. 15 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి.

ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గిరివర్ధన్‌రెడ్డి

జీడిమెట్ల: ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో మంగళవారం విచారణకు హాజరై తన వాంగ్మూలాన్ని ఇచ్చినట్లు చెప్పారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్‌లోని పార్టీ కార్యాలయంలో నేతలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజురాబాద్ నియోజకవర్గం ఉప ఎన్నికలో ఈటల రాజేందర్‌ను ఓడిచేందుకు తనతో పాటు సామాన్య కార్యకర్తల ఫోన్‌లను కూడా టాప్ చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోపాయికారి ఒప్పందంతో దర్యాప్తులో జాప్యం జరుగుతుందని ఆరోపించారు. సమావేశంలో గాజులరామారం కార్పొరేటర్ శేషగిరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమావాస్య పూజలు.. అన్నదానాలు

- ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు



మగ్దూం నగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకొని బుధవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి ఆలయంలో అమ్మవారికి, అంజయ్య నగర్‌లో నల్లపోచమ్మ అమ్మవారికి, జగద్గిరి గుట్ట లాస్ట్ బస్టాప్‌లో దుర్గమ్మ తల్లికి, మగ్దూం నగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా వాసవి సేవా సమితి, సప్తగిరి వైశ్య ఫ్రెండ్స్ గ్రూప్, సుచిత్ర వాసవి సేవా, ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మగ్దూం నగర్, భూదేవి హిల్స్, మైసమ్మ నగర్‌లో బొడ్రాయిల వద్ద అభిషేకం నిర్వహించారు.

నిజాంపేట్: జ్యైష్ఠ అమావాస్య సందర్భంగా బాచుపల్లి డివిజన్ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వంగపల్లి నవీన్ కుమార్ నేతృత్వంలో బాచుపల్లి మమత మెడికల్ కళాశాల ముందు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 మందికి అన్నదానం చేశారు. అనంతరం అన్నదాత బెజుగం శోభరాణిని సత్కరించారు. కార్యక్రమంలో వినయ్, ఆంజనేయులు, శ్రీకాంత్, శ్రీరాం, ఫణి కుమార్, సంతోష్, కవిత, పద్మ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: గాజులరామారంలోని వీఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి పేరుతో ప్రతి నెల అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శుభశక్తి జ్ఞాన యోగ వ్యవస్థాపకుడు కొడ మల్లేష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఇంద్రసేన గుప్తా, రాధా కిషన్ గుప్తా, అభిషేక్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా, శ్రీరామ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సుచిత్రలో వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో..

కుత్బుల్లాపూర్: వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో సుచిత్రలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సేవకుడు మొగుడంపల్లి ఉపేందర్ మాట్లాడుతూ.. పేదలకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు తోట భిక్షపతి, వెంకటేశం, పల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బాచుపల్లి డివిజన్‌లో..



సుచిత్రలో వాసవీ సేవాదళ్ నిర్వహించిన అన్నదానంలో ..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ గాజులరామారం ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాలాజీ లేఅవుట్, తత్వా స్కూల్ లేన్, గాజులరామారం మహారాజా గార్డెన్స్ లేన్‌లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ క్రమంలో గురువారం సరఫరాలో అవాంతరాలు తలెత్తనున్నాయని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మీనాక్షి ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మీనాక్షి ఎస్టేట్స్‌కాలనీ, స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, అంగడిపేట్ గ్రామం, 11కేవీ సెయింట్ ఆన్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్‌సీఎల్ కాలనీ, హైటెన్షన్ రోడ్డు, రెనోవా ఆసుపత్రి వెనుక గల్లీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

చింతల్: విద్యుత్ సబ్ స్టేషన్ల ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపినట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి న్యూ బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ శోభన కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు మాధవినగర్, రెమిడి హాస్పిటల్, సామ్రాట్ హోటల్, శోభన కాలనీ రోడ్డు నెంబర్ వన్, శోభన కాంప్లెక్స్, అభిషేక్ టవర్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, షిరిడీ సాయి కాలనీ, ఫిష్ మార్కెట్ 2, ఎస్ఎంఆర్ వినయ్ కాంప్లెక్స్, బాంబే డయింగ్, మాధవి నగర్ బస్తీ, విమల్ థియేటర్ బ్యాక్ సైడ్, శోభన బస్టాప్, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాజు కాలనీ ఫీడర్ పరిధిలో హరిజన బస్తీ, సాయినగర్, చరణ్ ఎంక్లేవ్, వినాయక నగర్, మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు సాయిబాబా టెంపుల్ ఫీడర్ పరిధిలో సాయి దర్శన్ అపార్ట్‌మెంట్స్, జయనగర్ 1, సాయి కృప అపార్ట్‌మెంట్స్, ద్వారకామయి అపార్ట్‌మెంట్స్, చిత్తారెడ్డి కాలనీ, నూతన్ కాలనీ, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు రిలయన్స్ విల్లా ఫీడర్ పరిధిలో శ్రీమలాని కాలనీ, రిలయన్స్ విల్లాస్, తాడ్‌బండ్, స్వీట్ హార్ట్ హోటల్, శ్రీ చైతన్య స్కూల్, బ్రిలియంట్ స్కూల్, రాఘవేంద్ర హాస్పిటల్ బ్యాక్ సైడ్, సత్య టవర్స్, తాడ్‌బండ్ చౌరస్తా, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు సీతారామ్‌పురం ఫీడర్ పరిధిలో సీతారామ్‌పురం, గణేష్ కాలనీ, మర్రి రామిరెడ్డి కాలనీ, యాదవ బస్తీ, ఓల్డ్ కళ్యాణి థియేటర్, బృందావన కాలనీ, సిండికేట్ బ్యాంక్ కాలనీ, ఐస్ ఫ్యాక్టరీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నిజాంపేట్: మయూరి నగర్ సబ్‌స్టేషన్ 11కేవీ గోకరాజు రంగరాజు ఫీడర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు గోకరాజు కళాశాల రోడ్డు, ఆర్ఎస్ నగరం, విజ్ఞాన్ కళాశాల ప్రాంతాలు. అలాగే 11కేవీ ప్రశాంత్ నగర్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 12గంటల వరకు వృద్ధాశ్రమం, వెంకట్ రాయ్‌నగర్, బాలాజీ ఎన్‌క్లేవ్, సిరి ఎన్‌క్లేవ్, ఇందిరమ్మ ఫేజ్ 1, 2, ఆర్‌ఎల్ సిటీ రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.